కార్డు జాడేదీ..?

దరఖాస్తులకే పరిమితమైన ఆహార భద్రత కార్డుల జారీ ప్రక్రియ

- కొత్త కార్డుల కోసం తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ
- ఏళ్లు గడుస్తున్నా.. కార్డుల మంజూరులో తీవ్ర జాప్యం
- మ్యుటేషన్ల దరఖాస్తులను పట్టించుకునే వారే కరువు
- పెండింగ్‌లో 69,326 మ్యుటేషన్ల దరఖాస్తులు



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఆహార భద్రత కార్డుల జారీ ప్రక్రియ కేవలం దరఖాస్తులకే పరిమితమైంది. దరఖాస్తులు చేసి ఏళ్లు గడుస్తున్నా.. కార్డుల మంజూరులో తీవ్ర జాప్యంతో దరఖాస్తుదారులు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. ఆసరా పింఛన్లు, ఆరోగ్యశ్రీ, కల్యాణ లక్ష్మీ, ఉపకారవేతనాల మంజూరు, ముఖ్యమంత్రి సహాయ నిధి వంటి దరఖాస్తులకు ఆహార భద్రత కార్డును ప్రామాణికంగా తీసుకోవడంతో కొత్త కార్డుల మంజూరు లేక.. అర్హత ఉన్నా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని దుస్థితి ఏర్పడింది.

దరఖాస్తుదారుల నిరీక్షణ

జిల్లాలో 15 మండలాలకుగాను 5,23,842 ఆహార భద్రత కార్డులు ఉండగా వాటిలోని 17,24,481 మంది సభ్యులకు ప్రతినెలా ప్రభుత్వం చౌకధరల దుకాణాల ద్వారా రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తోంది. కార్డులో ఎంత మంది ఉంటే.. అంత మందికి పరిమితి లేకుండా ప్రతినెలా 6 కిలోలు, అంత్యోదయ కార్డుదారులకు కార్డుకు 35 కిలోల వంతున బియ్యం పంపిణీ చేస్తోంది. కొత్తగా వివాహం చేసుకున్న వారు భార్యాభర్తలు పాత కార్డుల్లో తమ పేర్లను తొలగించుకొని నూతన కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. పాత కార్డుల్లోంచి దరఖాస్తుదారుల పేర్లను తక్షణం తొలగించిన అధికారులు నూతన కార్డులు మంజూరు చేయకపోవడంతో వారి పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా తయారైంది. పిల్లలు పుట్టాక వారి పేర్లను రేషన్ కార్డుల్లో చేర్చడానికి దరఖాస్తు చేసుకుంటున్న వారికి నిరాశే ఎదురవుతోంది. గతంలో 95,040 దరఖాస్తులు రాగా, వాటిలో సుమారు 985 కార్డులను మాత్రమే మంజూరు చేసి సంబంధిత అధికారులు చేతులు దులుపుకున్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా మ్యుటేషన్ల(చేర్పులు, మార్పుల) కోసం పెట్టుకున్న 69,326 దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లోనే అపరిష్కృతంగా ఉన్నాయి. ప్రస్తుతం మీ సేవ కేంద్రాల్లో నూతన కార్డుల కోసం దరఖాస్తు ప్రక్రియ అందుబాటులో లేకపోవడంతో పలువురు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు.

వేగవంతం చేయాలి

మా అబ్బాయికి 5 సంవత్సరాల వయస్సు ఉన్నప్పుడు రేషన్ కార్డులో పేరు నమోదు కోసం మీ సేవలో దరఖాస్తు చేశా. ఇప్పటికీ అతడి వయస్సు 8 సంవత్సరాలు, తహసీల్దార్ కార్యాలయంలో అడిగితే మా చేతిలో ఏమీ లేదు.. మేము పరిశీలన జరిపి సంబంధిత అధికారులకు పంపించామని చెబుతున్నారు. అర్హులకు ఆహార భద్రత కార్డు అందేలా కార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలి.

– బి.కిరణ్‌రెడ్డి, బోడుప్పల్

ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా..

మండలాల వారీగా అర్హులైన వారితో జాబితా సిద్ధంగా ఉంది. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే నూతన ఆహార భద్రత కార్డులు మంజూరు చేస్తాం. ప్రభుత్వం ప్రస్తుతం కొత్త రేషన్ కార్డు దరఖాస్తు ప్రక్రియను నిలిపివేసింది. సవరణ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉన్నా.. ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటాం.

– తనుజా, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా

క్లుప్తంగా

వీల్‌చైర్ అందజేత



అజ్మీరి బేగంకు వీల్‌చైర్ అందజేస్తున్న దొడ్ల రామకృష్ణగౌడ్

ఆల్విన్‌కాలనీ: హోప్ ఆఫ్ హంగర్ చారిటుబల్ ట్రస్ట్ వారు ఎల్లమ్మబండ ఎన్‌టీఆర్‌నగర్‌కు చెందిన అజ్మీరి బేగంకు వీల్‌చైర్‌ను యువనేత దొడ్ల రామకృష్ణ చేతుల మీదుగా సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లోని ప్రజలకు సేవ చేస్తున్నందుకు సంస్థ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో కూడా సేవా కార్యక్రమాలు ఇలాగే కొనసాగాలని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ టీమ్ సభ్యులు అలేఖ్య, వెంకటేశ్వరరావు, మల్లీశ్వరి, రవికిరణ్, అమూల్య తదితరులు పాల్గొన్నారు.

ఎర్లీ బర్డ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

దుండిగల్: ఎర్లీ బర్డ్ పథకాన్ని మున్సిపల్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ రావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎర్లీ బర్డ్ పథకానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. సోమవారం పలువురు దుండిగల్ మున్సిపల్ మేనేజర్ సునందకు ఈ పథకం కింద ఇంటి పన్నులు చెల్లించి 5 శాతం రిబేటు పొందారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఏప్రిల్ 30వ తేదీ లోపు ఇంటి పన్ను చెల్లించే వారికి ఎర్ల బర్డ్ పథకం వర్తిస్తుందన్నారు.

రంజాన్ తోఫాల పంపిణీ




ముస్లింలకు రంజాన్ తోఫాను అందజేస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండలోని ఖాజానగర్ మసీద్ ఏ గరీబ్ నవాజ్ దర్గా వద్ద ప్రభుత్వం అందజేసిన రంజాన్ తోఫాలను సోమవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అన్ని మతాలను గౌరవిస్తూ బతుకమ్మ, క్రిస్మస్, రంజాన్ పండగలకు చీరలు, గిఫ్ట్, తోఫాలను అందజేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, కాశీనాథ్‌యాదవ్, గుడ్ల శ్రీనివాస్, ఎండీ షరీఫుద్దీన్, మసీదు కమిటీ అధ్యక్షుడు ఎండీ సుల్తాన్, జనరల్ సెక్రటరీ ఎండీ ఖలీం, మైనార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు షేక్ బీబీ తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ నిర్మాణాన్ని అడ్డుకోవాలి

నిజాంపేట్: నిజాంపేట కార్పొరేషన్ పరిధి స్ప్రింగ్ విల్లా కాలనీలో ఏర్పాటు చేయనున్న సెల్ టవర్ నిర్మాణాన్ని అడ్డుకోవాలని సోమవారం మున్సిపల్ కమిషనర్‌కు కాలనీవాసులు వినతి పత్రం సమర్పించారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే మొబైల్ టవర్‌ను నివాసిత ప్రాంతాల మధ్య ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. జిమ్‌తో పాటు చిన్నపాటి ఫంక్షన్‌లు చేసుకునే స్థలంలో టవర్ ఏర్పాటు చేస్తుండటంతో దాని ద్వారా వెలువడే రేడియేషన్ వల్ల అనారోగ్యం బారిన పడతామని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే టవర్ ఏర్పాటు చేస్తున్న ప్రాంతాన్ని పరిశీలించాలని కోరారు. మున్సిపల్ అధికారులు పట్టించుకోకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

నిర్మలకుమారికి శ్రద్ధాంజలి



కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ ఫంక్షన్‌హాలులో బీజేపీ అధ్యక్షుడు గంధం రాజు సతీమణి గంధం నిర్మల కుమారి పెద్దకర్మ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొని ఆమె చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం గంధం రాజుని ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి సీనియర్ జర్నలిస్ట్ విద్యా వెంకట్, మేడ్చల్ జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు తేళ్ల హరికృష్ణ, పీఎల్ ప్రసాద్, సాయిబాబా చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

దుండిగల్: కొంపల్లి మున్సిపల్ బీఆర్ఎస్ నేత జెమ్మి దేవేందర్‌ను సోమవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పరామర్శించారు. కొన్ని రోజులుగా దేవేందర్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన దేవేందర్ ఇంటికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో అన్నీ సమస్యలే

బీజేపీ రాష్ట్ర నేత రవికుమార్ యాదవ్



గడప గడపకు పాదయాత్రలో పాల్గొని సమస్యలను అడిగి తెలుసుకుంటున్న రవికుమార్ యాదవ్

ఆల్విన్‌కాలనీ: బీజేపీ రాష్ట్ర నాయకుడు రవికుమార్ యాదవ్ చేపట్టిన గడప గడపకు బీజేపీలో భాగంగా సోమవారం పాదయాత్ర ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలో కొనసాగింది. తారక్‌రామ్‌నగర్, గణేష్‌నగర్, మహాత్మా గాంధీ, రాజీవ్‌గాంధీ నగర్, సుభాష్‌చంద్ర బోస్ నగర్, అంబేడ్కర్‌నగర్‌లలో పర్యటించి సమస్యలను పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. డివిజన్‌లో అధికారులు, నాయకుల పనితీరు ఇంట్లో ఈగల మోత, బయట పల్లకి మోత అన్నట్లుగా ఉందని విమర్శించారు. ఎక్కడ చూసినా సమస్యలే కనిపిస్తున్నాయని అన్నారు. తాము పాదయాత్రలు చేసి సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్తేనే వారికి సమస్యలు కనిపిస్తున్నాయని విమర్శించారు. అధికారులు స్వయంగా సమస్యలను గుర్తించటం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటూ కాలం గడుపుతున్నారని ఆరోపించారు. ఇకనైనా మొద్దు నిద్ర వదులుకొని ప్రజా సమస్యలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కుమార్‌యాదవ్, కమలాకర్‌రెడ్డి, అనిత, నర్సింగ్‌రావుయాదవ్, నరసింహాచారి, స్రవంతి, కవిత, రాజు తదితరుల పాల్గొన్నారు.

నాలా పై కప్పు పనులను త్వరగా పూర్తి చేయాలి



నాలా పై కప్పు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మహేందర్

మోతీనగర్: కబీర్‌నగర్‌లోని నాలా పై కప్పు పనులను మూసాపేట కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్ సోమవారం ఈఈ సత్యనారాయణ, డీఈ ఆనంద్, ఏఈ రంజిత్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలా పనులు నత్తనడకన సాగుతున్నాయని అన్నారు. కాంట్రాక్టర్ రోజూ ఇద్దరు కూలీలను తీసుకువచ్చి పనులు చేస్తున్నారని అన్నారు. ఇలా అయితే పనులు ఎప్పటికి పూర్తవుతాయని అధికారులను ఆయన ప్రశ్నించారు. నాలా పై కప్పు పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎర్రస్వామి, రమేష్‌నాయర్, సతీష్ చారి, కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

హైదర్‌నగర్ డివిజన్‌ను అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతా

కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు



బృందావన్ కాలనీలో ఏర్పడిన డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని బృందావన్‌కాలనీలో డ్రైనేజీ మ్యాన్‌హోల్ నిర్మాణ పనులను జలమండలి డీజీఎం వెంకటేశ్వర్లు, మేనేజర్ ప్రశాంతితో కలిసి సోమవారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దడానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. అదే విధంగా డ్రైనేజీ మ్యాన్‌హోల్ పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తానన్నారు. ఈ కార్యక్రమంలో హైదర్‌నగర్ డివిజన్ ఉపాధ్యక్షుడు కోనేరు రాగప్రసాద్, రవికుమార్, సూర్యనారాయణ, రాజేష్, సురేష్, గణేష్, కృష్ణప్రసాద్, నాగేశ్వరరావు, సత్యనారాయణ, నాగేందర్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శిస్తున్న బీజేపీ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు

కూకట్‌పల్లి: బాలానగర్ డివిజన్ పరిధిలోని రాజు కాలనీలో వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో కేబీకే మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వారి సౌజన్యంతో నాల్గో రోజు ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరాన్ని బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు సందర్శించి అక్కడ ప్రజల కోసం ఏర్పాటు చేసిన సదుపాయాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తూ ముందుగానే ఆరోగ్య పరీక్షలు చేయించుకొని వైద్యుల సూచనల మేరకు మందులు వాడి ఆరోగ్య సూత్రాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అర్సనపల్లి సూర్యరావు, బీజేపీ సీనియర్ నాయకులు సురేందర్‌రెడ్డి, కొత్తూరు రమేష్, కల్పన, రమేష్, లక్ష్మణ, శివరంజని, మధు, సాయి, సమంత్, బచేందర్‌సింగ్, సోను సింగ్, సంధ్య, లక్ష్మి, వాణిశ్రీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ కానుకల పంపిణీ

జగద్గిరిగుట్ట: తెలంగాణ ప్రభుత్వం మైనార్టీల అభ్యున్నతికి ఎంతో తోడ్పాటును అందిస్తోందని జగద్గిరిగుట్ట కార్పొరేటర్ జగన్ అన్నారు. సోమవారం జగద్గిరిగుట్ట రాజీవ్‌గృహకల్పలో ముస్లింలకు ఆయన రంజాన్ తోఫాలను అందజేశారు.

బీజేపీతోనే సామాజిక న్యాయం

కుత్బుల్లాపూర్: బీజేపీతోనే అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. బీజేపీ సామాజిక న్యాయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం బీజేపీ మహిళా మోర్చా కుత్బుల్లాపూర్ డివిజన్ అధ్యక్షురాలు అలివేలు ఆధ్వర్యంలో వాణినగర్‌లో సహపంక్తి భోజన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీశైలంగౌడ్ దళిత మహిళలు,కార్యకర్తలతో కలిసి భోజనం చేశారు.

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలో అన్ని వర్గాల ప్రజల ఆదరణను పొందుతున్న ఏకైక పార్టీ బీజేపీ అని అన్నారు. బీజేపీతోనే పేద, బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు , సెన్సార్ బోర్డు సభ్యుడు నటరాజ్ గౌడ్, బీజేపీ నాయకులు దయాకర్, రవి, భూషణం, పలువురు మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

◆ అదే విధంగా కొంపల్లి మున్సిపాలిటీ పరిధి దూలపల్లి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై బీజేఎంఎం నాయకులు, పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, కౌన్సిలర్లు రాజిరెడ్డి, జనార్దన్‌రెడ్డి, శ్యామల, విజయలక్ష్మి, సరిత, సంధ్య, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: నిజాంపేట్, ఎస్ఎంఎస్, మా విల్లాస్ ఫీడర్ల పరిధిలో మంగళవారం మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఎస్‌వీఎస్ ఆభర్ణ, కాకతీయ హిల్స్, శ్రీనిధిహిల్ పార్క్, కేజీఎం విల్లాస్, ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని బాచుపల్లి ఏఈఓ ప్రకటనలో తెలియజేశారు.

ప్రతి ఒక్కరూ సమాజాభివృద్ధికి పాటుపడాలి



నీలిమా ఆస్పత్రి ఆధ్వర్యంలో నూతన వస్త్రాలను అందజేస్తున్న ఆస్పత్రి చైర్మన్ డా. శ్రీనివాస్

మోతీనగర్: ప్రతి ఒక్కరూ సంపాదించిన దానిలో కొంతైనా సమాజాభివృద్ధి కోసం వెచ్చించినప్పుడే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని నీలిమ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ పి. శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం మూసాపేట డివిజన్ పాండురంగనగర్‌లోని ఆస్పత్రి ఆవరణలో రంజాన్ మాసం పురస్కరించుకొని ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత దశాబ్దం నుంచి ప్రతి రంజాన్ మాసంలో ముస్లిం మహిళలకు చీరలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. నిరంతరం సమాజం హితం కోరే వ్యక్తులను సమాజం ఎప్పుడు గుర్తుంచుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నీలిమ, వైద్యులు రేవతి, మౌనిక, హిమబిందు, శ్రీతేజ, కామేశ్వరి, వెంకటేశ్వర్లు, ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈర్ల చెరువు సుందరీకరణ పనులు వేగవంతం చేయాలి

నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి



నాలా విస్తరణ పనుల పరిశీలనకు వెళ్తున్న మేయర్, డిప్యూటి మేయర్, ఎమ్మెల్యే

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఈర్ల చెరువు సుందరీకరణ పనులను త్వరగా పూర్తి చేయాలని నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి అన్నారు. సోమవారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఈర్ల చెరువు అభివృద్ధి, సుందరీకరణ, నాలా విస్తరణ పనులను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, డిప్యూటి మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డిలతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2022 సంవత్సరంలో ఈర్ల చెరువును దత్తత తీసుకున్న విషయం తెలిసిందన్నారు. నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని సూచించారు అధికారులు సమన్వయంతో కలిసి పని చేసి పురోగతి సాధించాలన్నారు. ఈ పరిశీలనలో ఇరిగేషన్ అధికారులు డీఈ నళిని, ఏఈ పావని, జీహెచ్ఎంసీ అధికారులు ఈఈ శ్రీకాంతి, డీఈ స్రవంతి, ఏఈ ప్రతాప్, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్ తదితరులు ఉన్నారు.

వైశాఖీ ఉత్సవాలకు గురుద్వారా సిద్ధం

అమీర్‌పేట: ఖల్సాపంత్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని అమీర్‌పేట గురుద్వారా సాహెబ్ ఆధ్వర్యంలో నిర్వహించే వైశాఖీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. వేడుకల నేపథ్యంలో వచ్చే భక్తుల కోసం నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. అమీర్‌పేట గురుద్వారాను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఈ నెల 13 నుంచి 15 వరకు జరిగే ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు తెలంగాణ రాష్ట్రంతో పాటు ఇతర ప్రాంతాల నుండి సిక్కు సోదరులు పెద్ద సంఖ్యలో హాజరవుతారు. మొదటి రోజు అమృత్ పాన్ కార్యక్రమాన్ని సిక్కు సంప్రదాయబద్ధంగా అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు. పంజాబ్‌లోని అమృత్‌సర్ నుంచి ప్రత్యేకంగా గురుద్వారాకు విచ్చేసిన పంచ్‌ప్యారస్‌గా పిలిచే ఐదుగురు సిక్కు మతగురువులు (రాగి జత్తాస్) గుర్బాణీ కీర్తనలు ఆలపిస్తూ గురుగ్రంథ పఠనం చేస్తూ అమృత్ పాన్ (పవిత్ర పానీయం)ను తయారు చేశారు. సిక్కు మత సంప్రదాయాలను పాటిస్తూ సిక్కు మతాన్ని అధికారికంగా అంగీకరించే వారికి ఈ పానీయాన్ని అందజేస్తారు. హోలి బాప్టిజంగా పేర్కొనే అంశం ద్వారా సిక్కు యువతీ, యువకులు, మహిళలు, మతపెద్దలు అమృత్‌పాన్ స్వీకరించారు. పవిత్ర పానీయాన్ని తీసుకున్న వారు జీవితాంతం సిక్కు మత నిబంధలైన కేశ్, కడా, కంగా కృపాన్, కచేరాగా పేర్కొనే ఐదు నిబంధనలు పాటించాల్సి ఉంటుందని గురుద్వారా కమిటీ సభ్యులు తెలిపారు.

సుమారు 50 వేల మంది భక్తులు..

వైశాఖీ వేడుకల్లో ప్రధాన ఘట్టమైన విశాల్ దివస్, నగర్ కీర్తన్ కార్యక్రమాలను అత్యంత వైభవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. రెండో రోజు ఉదయం గురుద్వారాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. అనంతరం సిక్కులు పవిత్రంగా భావించే గురుగ్రంథాన్ని ప్రత్యేకంగా రూపొందించిన వాహనంలో ఊరేగిస్తూ ధరంకరం రోడ్డులోని గురుగోవింద్‌సింగ్ మున్సిపల్ స్టేడియంకు తీసుకువస్తారు. జంటనగరాల నుంచి సుమారు 50 వేల మంది భక్తులు ఇందులో పాల్గొంటారని ప్రబంధక్ కమిటీ సభ్యులు తెలిపారు. వేడుకలను పురస్కరించుకుని అమీర్‌పేట పరిసర ప్రాంతాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎస్ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ కె.సైదులు తెలిపారు.



విద్యుద్దీపాల వెలుగులో అమీర్‌పేట గురుద్వారా

DRAFT CITATION

IN THE COURT OF HON'BLE SR CIVIL JUDGE AT : RAICHUR

O.S. No. 8 /2022

PLAINTIFF P. RAJGOPAL S/O P.NAGENDRAPPA, AGE: 53 YRS, OCC: CONTRACTOR, R/O H-NO-1-11-466 RAMPUR ROAD, NIJALINGAPPA COLONY RAICHUR

// V/S //

DEFENDANT 4] H.MAJULA W/O H.RAJU D/O P.NAGENDRAPPA, AGE : 42 YEARS, OCC; HOUSEHOLD R/O SECOND FLOOR BARATH NAGAR NEAR WATER TANK HYDERABAD

Whereas the above named plaintiff has instituted a suit against you for partition and separate possession.

You are hereby summoned to appear in this court in person or by a pleader duly instructed and able to answer all material question relating to the suit, or who shall be accompanied by some person able to answer all such question on the 26th day of May 2023 at Raichur 11 am in the forenoon/ Morning to answer the claim, and as the day fixed for the final disposal of the suit, you must be prepared to produce on that day all the witnesses upon whose evidence and all the documents upon which you intend to rely in support of your evidence.

Take notice that, in default of your appearance on the day before mentioned the suit will be heard and determined in your absence.

Given under my hand and seal of the court, this 5th day of April/2023.

Through: //By order of the Court//

Advocate Chief Ministerial Officer, Prl sr Civil Judge At : Raichur

ప్రజలు మమ్మల్ని భారీ మెజార్టీతో గెలిపిస్తారు

- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- మూసాపేటలో ఘనంగా బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మూసాపేట: ప్రజలు తమ పక్షాన ఉన్నారని రాబోయే ఎన్నికల్లో బ్రహ్మాండమైన మెజార్టీతో గెలిపిస్తారని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సోమవారం మూసాపేటలోని గూడ్స్‌షెడ్ రోడ్డులోని రాయల్ ఫంక్షన్‌హాల్‌లో మూసాపేట డివిజన్ బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం డివిజన్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా కల్యాణలక్ష్మి, పెన్షన్లు, దళితబంధు అందిస్తున్నామని అన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఈ పథకాలను ఇస్తున్నారా అని ప్రశ్నించారు. కబీర్‌నగర్ నాలాను రూ.35కోట్లతో అభివృద్ధి చేసి నాలాపై శ్లాబ్ కూడా వేస్తున్నామని పేర్కొన్నారు. గతంలో నాలా ఉన్న చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. అంతేకాకుండా అవంతినగర్, బబ్బుగూడ, అవంతినగర్ తోట, మోతీనగర్ తదితర ప్రాంతాలు గతంలో ఎలా ఉండేవో ఇప్పుడు ఏ విధంగా ఉన్నాయో గమనించాలని అన్నారు.

డివిజన్‌లో 3800 మందికి పెన్షన్లు

మూసాపేట డివిజన్‌లోనే 3800 మందికి పెన్షన్లు ఇస్తున్నామని ఇంకా ఎవరైనా రాని వారంటే వారికి కూడా అందజేస్తామని హామీ ఇచ్చారు. దళిత బంధు, పెన్షన్లు, కల్యాణలక్ష్మి తదితర పథకాలను పార్టీల కతీతంగా అర్హులకు అందిస్తున్నామని తెలిపారు. శ్రీకాకుళం ప్రజలకు అన్ని విధాల అండగా ఉన్నామని పేర్కొన్నారు. కమ్యూనిటీహాల్ కూడా కట్టించామని తెలిపారు. గుడి, బడి, శ్మశానవాటికలు, ఓపెన్ జిమ్‌లు, పార్కులు వంటివి నిర్మిస్తూ అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నానని అన్నారు. ఎస్సీ శ్మశానవాటికను రూ.80 లక్షలతో అభివృద్ధి చేశానన్నారు. మూసాపేట పురాతన లక్ష్మీనరసింహ ఆలయాన్ని, ఆలయ గోపురం కోసం రూ.25లక్షలు తన సొంత నిధులు కేటాయించానని తెలిపారు.

ఎంపీగా గెలిచిన రేవంత్‌రెడ్డి ఏమి చేశారు..?

ఎంపీగా రేవంత్‌రెడ్డి గెలిచిన తరువాత కనీసం మూసాపేట వైపు కూడా చూడలేదన్నారు. ప్రగల్భాలు పలికిన ఆయన మీకు ఏమి చేశారో గుర్తు చేసుకోవాలన్నారు. గెలిపిస్తే నిధులు తీసుకువచ్చి ఎంతో అభివృద్ధి చేస్తామన్న బీజేపీ ఇప్పుడు ఏమి చేసిందని ప్రశ్నించారు. కార్లు, బైక్‌లు ఇస్తామన్న నాయకులు ఎటు వెళ్లారని ఆయన ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌కు కూడా అంబేడ్కర్ పేరు పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్‌లు పి. బాబూరావు, నరేంద్రాచార్య, కోఆర్డినేటర్ సతీష్ అరోరా, మాజీ కౌన్సిలర్ సీహెచ్. సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, ప్రభాకర్‌గౌడ్, నాయకులు కర్క పెంటయ్య, జిల్లా గోపాల్, తూము అశోక్, బొశెట్టి నర్సింగ్‌రావు, సత్యం, నపారి చంద్రశేఖర్, కర్క రవీందర్, హరినాథ్, సప్పిడి శ్రీనివాస్, తుకారాం, ఇనుగంటి రాజు, విష్ణు, సత్యనారాయణ గౌడ్, రమేష్ యాదవ్, అనితా శ్రీపాద్, భానుమతి, సూర్యకళ, తదితరులు పాల్గొన్నారు.